సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం, 6, మే, 2025



సోమశిలలో 50.754 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 50.754 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువన వివిధ కాలువలకు 1110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.97,860
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,887
3 శాతం జీఎస్టీతో	రూ.9,154
సవర (8 గ్రా)	రూ.73,232

గరిష్టం/కనిష్టం
37.6 /26.3

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. సోమవారం గాలిలో తేమ 59 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఎంప్లాయిమెంట్ రిటర్న్స్ సమర్పించండి

నెల్లూరురూరల్: పబ్లిక్, ప్రైవేట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఎంప్లాయిమెంట్ రిటర్న్స్ www. employment. ap. gov. in employer login ద్వారా సమర్పించాలని జిల్లా ఉపాధి శాఖ అధికారి వినయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి తెలియజేయాల్సి ఉందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే సెల్ నంబరు 9642653931లో కాని, జిల్లా ఉపాధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు.

డీసీపల్లిలో 555 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 555 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 779 బేళ్లు రాగా 555 బేళ్లు విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 71,546.9 కిలోల పొగాకు విక్రయించగా రూ.1,79,61,586.20 వ్యాపారం జరిగింది. కిలో గరిష్ట ధర రూ.280 కాగా, కనిష్ట ధర రూ.210 లభించింది. సగటు ధర రూ.251.05 నమోదైంది. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

- కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్ రైతులు 327 బేళ్లను అమ్మకానికి తీసుకు రాగా 282 పొగాకు బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 45 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి టి. ఇషాక్‌స్వర్ణదత్ మాట్లాడుతూ కనిష్ట ధర రూ.210 పలకగా, సగటు ధర రూ.254.39 లభించిందన్నారు. వేలంలో 15 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

నీటి విడుదల ప్రక్రియ వాయిదా

సోమశిల: ఐఏబీ సమావేశంలో నిర్ణయించిన ప్రకారం సోమశిల జలాశయం ద్వారా సోమవారం నుంచి నీరు విడుదల చేయాల్సి ఉంది. అయితే సంబంధిత ఉన్నతాధికారుల నుంచి ఇండెంట్ రాకపోవడంతో నీటిని విడుదల చేయలేదని, బుధవారం డెల్టాకు నీటిని విడుదల చేస్తామని, ఉత్తర, దక్షిణ కాలువలకు మాత్రం ఇండెంట్ వచ్చినప్పుడు విడుదల చేస్తామని జలాశయం ఈఈ శ్రీనివాస్ తెలిపారు.

జిల్లా జైల్లో ఖైదీ ఆత్మహత్యాయత్నం వైరల్

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న జిల్లా జైల్లో ఓ ఖైదీ గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఖైదీలకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం జీఓ నంబరు 58 బదులు జీఓ నంబరు 71 అమలు చేయడమే దీనికి కారణమని సమాచారమని విస్తృతంగా వైరల్ కావడంతో అధికార యంత్రాంగం ఉలికిపడింది. ఈ విషయమై జైలు అధికారులను సంప్రదించగా అలాంటి ఘటన జైల్లో జరగలేదని చెబుతున్నారు.

సమ్మె ఆపే ప్రసక్తే లేదు



ధర్నా చేస్తున్న సీహెచ్‌ఓలు

నెల్లూరు (అర్బన్): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపే ప్రసక్తే లేదని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ తెలిపారు. పెండింగ్ బకాయిలు, ఇన్‌సెంటివ్స్ చెల్లించాలని, వేతన సవరణ అంశంలో న్యాయం చేయాలని కోరుతూ సీహెచ్‌ఓలు గత 9 రోజులుగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మూసేసి జిల్లా వైద్యశాఖ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్నారు. సోమవారం భానుమహేష్ మాట్లాడుతూ తాము ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరలేదన్నారు. ఆరేళ్లుగా జీతం పెంచలేదన్నారు. రెండు ఏళ్లుగా చెల్లించాల్సిన బకాయిలు, ఇన్‌సెంటివ్స్ ఇవ్వకుండా కొత్తగా ఇప్పుడు సీహెచ్‌ఓలు చేసే పని ఆధారంగానే ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయమన్నారు. మా ఆవేదన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే తాము సమ్మెలోకి వెళ్లామన్నారు. తమ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు సీహెచ్‌ఓల పేరుతో కొత్త సోషల్ మీడియా అకౌంట్ ఓపెన్ చేసి తాము ఇతరులను దూషించినట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని తాము సైబర్ క్రైమ్ కింద డీఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఆదిల్, రెబకా పలువురు సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఖాకీ.. సిగ్గుపడు

అదుపు తప్పిన శాంతిభద్రతలు

- కట్టడి చేయలేని కొందరు పోలీసులు
- పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసి ప్రజాస్వామ్యం హననం
- రెడ్‌బుక్ రాజ్యాంగానికి గులాంగిరి
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులా
- ప్రభుత్వం మారితే మీ పరిస్థితి ఏమిటి?

జిల్లాలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. హత్యలు, హత్యాయత్నాలతో జిల్లా అట్టుడికిపోతోంది. కావలిలో బృందావనం కాలనీలో జరిగిన భారీ చోరీలో ఇప్పటి వరకు నిందితులను పట్టుకోలేకపోయారు. కావలి సమీపంలో ఒక మహిళ హత్య కేసులో ఇంత వరకు చిన్న క్లూ కూడా కనిపెట్టలేకపోయారు. కానీ అసమర్థ పాలకుల చేతిలో కొందరు ఖాకీలు.. కీలుబొమ్మలా మారి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు కట్టి పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసి ప్రజాస్వామ్య హననానికి పాల్పడ్డారు. మరో వైపు ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్థతను ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు నమోదు చేసి గొంతుకలు నొక్కే ప్రయత్నం చేస్తున్న ఖాకీ.. సిగ్గుపడు.



సాక్షి ప్రతినిధి నెల్లూరు: జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి మంత్రులు, ఎంపీ దాకా మట్టి నుంచి ఇసుక, గ్రావెల్, క్వార్ట్జ్, మైకా వరకు సహజ వనరులను విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. పార్టీ క్యాడర్ ఊరూరా మద్యం బెల్టు షాపులు పెట్టి బరితెగించి విక్రయాలు సాగిస్తున్నారు. మరో వైపు రేషన్ బియ్యం, కోళ్ల వ్యర్థాలు, పశువుల అక్రమ రవాణా దందా సాగిస్తూ రూ.కోట్ల వ్యాపారం చేస్తున్నారు. ఇంకో వైపు హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, దొంగతనాలు, మహిళలపై లైంగిక దాడులు వంటి దారుణాలు జరుగుతున్నాయి. వీటిని కట్టడి చేయలేని జిల్లాలో కొందరు పోలీసులు అసమర్థ పాలకుల చేతిలో కీలుబొమ్మల్లా మారి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మాత్రం కచ్చితంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్థతను ప్రశ్నించే మీడియా కావచ్చు.. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సోషల్ యాక్టివిస్టులైనా సరే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన మెసేజ్‌లు ఫార్వార్డ్ చేయడాన్ని కూడా నేరంగా భావించి కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పసుపు చొక్కా తొడగని సామాన్యుడి నుంచి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేస్తున్నారు. తాజాగా కావలిలో సాక్షి జర్నలిస్టుతో సహా నలుగురు జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారు. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసి ప్రజాస్వామ్యాన్ని నడిబజారులో అసమర్థ పాలకులకు తాకట్టు పెట్టారు.

→ తాజాగా కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై ఐదేళ్ల కిందట అమృత్ స్కీమ్ పైలాన్ ధ్వంసం చేశారంటూ మూసేసిన పాత కేసును తిరిగి తెరిచి హత్యాయత్నం కేసు జోడించి నమోదు చేశారు. కావలిలో 2020లో అమృత్ పథకం పైలాన్ ధ్వంసం చేసిన కేసును తిరగతోడి మీడియా ప్రతినిధులు సహా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేతలు 12 మందిని నిందితులుగా చేర్చి అక్రమ కేసు బనాయించారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అవినీతి, అక్రమాలపై కథనాలు రాసిన పాత్రికేయుల నుంచి ఎన్నికల సమయంలో వ్యతిరేక పోస్టింగ్‌లు పెట్టినందరిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు. సామాన్య జర్నలిస్టులు పలుగు, పార పట్టుకుని పైలాన్ ధ్వంసం చేయడంతోపాటు అడ్డుచెప్పబోయిన టీడీపీ కార్యకర్తలను తరిమి కొట్టి హత్యాయత్నం చేశారని రిమాండ్ రిపోర్టులో చూపించడంపై పోలీస్ శాఖ చూపించిన అత్యుత్సాహం నివ్వెరపోయేలా ఉంది.

మాజీ మంత్రి అనిల్‌ను టార్గెట్ చేసి

రేపోమాపో మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌పై అక్రమ కేసులు నమోదు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మీడియా ముందు బాహాటంగా చెప్పడం చూస్తుంటే జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగం పతాక స్థాయి చేరిందని చెప్పొచ్చు. సైదాపురంలో మైనింగ్ మాఫియా దోపిడీపై రెండు రోజుల క్రితం ప్రెస్‌మీట్ పెట్టిన మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌ను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించేందుకు సిద్ధమవుతున్నట్లు, త్వరలోనే అరెస్ట్ అవుతున్నాడని ఎమ్మెల్సీ బీద సోమవారం ప్రెస్‌మీట్ ద్వారా చెప్పకనే చెప్పాడు. ఇరిగేషన్ శాఖలో అక్రమాలు జరిగాయని, అక్రమ మైనింగ్‌లో అతని ప్రమేయం ఉందని ఆ రెండు వ్యవహారాల్లో కేసులు నమోదుకు తుది దశకు చేరుకుందని చెప్పడం చూస్తుంటే మాజీమంత్రిని టార్గెట్‌చేసి జైలుకు పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఇట్టే తెలిసిపోతుంది. ప్రస్తుతం సైదాపురంలో అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఎంపీ వేమిరెడ్డి కనుసన్నల్లో జరిగే మైనింగ్‌ను వెలుగులోకి రానివ్వకుండా ఉండేందుకు అక్రమ కేసులు బూచి చూపిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

కాకాణితో ప్రారంభమై..

అధికార పార్టీ నేతల ప్రాపకం కోసం వైఎస్సార్‌సీపీ కీలక నేతలందరిపై కేసుల పరంపర కొనసాగించే రెడ్‌బుక్ రాజ్యాంగానికి కొందరు పోలీసులు తెరతీశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఏడు కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ వైఫల్యాలతోపాటు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతి అక్రమాలపై నిత్యం ఎండగట్టుతుండడంతో ప్రభుత్వ పెద్దలకు ఇబ్బందిగా మారింది. కాకాణిని టార్గెట్ చేసి ఏడు నెలలు వ్యవధిలోనే ఏడు కేసులు నమోదు చేయించారు. వాట్సాప్ గ్రూపుల్లో పేపర్ కటింగ్‌లు ఫార్వార్డ్ చేశాడనే కారణం నుంచి అక్రమ మైనింగ్ అంటూ అట్రాసిటీ కేసులు అంటూ ఏడు కేసులు పెట్టి ఆయన్ను ముప్పతిప్పలు పెడుతున్నారు. ఆ కుటుంబానికి నరకం చూపిస్తున్నారు.



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టుల ఐక్యవేదిక నాయకులు, పలువురు జర్నలిస్టులు

అక్రమ కేసును ఎత్తివేయాలి

- ఎస్పీకి జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక వినతి

నెల్లూరు (క్రైమ్): కావలి రెండో పట్టణ పోలీసులు జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కోరారు. ఈ మేరకు ఐక్యవేదిక నాయకులు, పలువురు జర్నలిస్టులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు. అనంతరం ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను బెదిరించే ధోరణితో ఉద్దేశ పూర్వకంగా జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. అందుకు కావలి ఘటనే నిదర్శనమన్నారు. కావలి పట్టణంలో అమృత్ పథకం పైలాన్‌ను 2020 ఏప్రిల్ 10వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారన్నారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు కావలి రెండో పట్టణ పోలీసులు మరుసటి రోజు కేసు నమోదు చేసినా సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును మూసివేశారన్నారు. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల వైఫల్యాలను, అక్రమాలను ఎత్తి చూపుతున్నారన్న అక్కసుతో ఐదేళ్ల అనంతరం ఆ కేసును రీ ఓపన్ చేయించి పైలాన్ ధ్వంసం ఘటనతో ఎలాంటి సంబంధం లేని కావలి 'సాక్షి' ఆర్సీ ఇన్‌చార్జి కె.శ్రీనివాసరావు (కేఎస్), కె.మాలకొండయ్య, బి.వెంకటలక్ష్మీనారాయణ, వి. ప్రసాద్‌తోపాటు మరికొందరు జర్నలిస్టులను నిందితులుగా చేర్చించి 307 ఐపీసీ తదితర నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లు నమోదు చేయించారన్నారు. ఆదివారం పోలీసులు హుటాహుటిన నలుగురు జర్నలిస్టులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. సమాజ హితం కోసం అహరహం పనిచేసే జర్నలిస్టులు హత్యాయత్నంకు పాల్పడినట్లు పేర్కొంటూ నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లు పెట్టడం దారుణమన్నారు. పైలాన్ ధ్వంసం సమయంలో మీడియాలోలేని ప్రసాద్‌ను సైతం కేసులో నిందితుడిగా చేర్చడం అక్రమ కేసుకు తార్కాణంగా నిలుస్తోందన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి పూర్వాపరాలను విచారించి అక్రమ కేసును ఎత్తివేయాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎ. జయప్రకాష్, సీహెచ్ మస్తాన్‌రెడ్డి, పి.బాలకృష్ణ, మునీంద్ర, పలువురు జర్నలిస్టులు తదితరులు ఉన్నారు.

బీదా.. అక్రమ మైనింగ్ కనపడదా?

- ఫ్యాక్టరీని చైనాలోనా, సైదాపురంలో నిర్మిస్తారా?
- పనుల్లేక వేల కుటుంబాలు రోడ్డు పాలు
- స్వార్థం కోసం పార్టీ మారి రూ.కోట్లు సంపాదిస్తున్న ఎంపీ వేమిరెడ్డి
- జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శీరిషా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొట్టేళ్ల శీరిషా

నెల్లూరు (పొగతోట): సైదాపురంలో అక్రమ మైనింగ్‌పై మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ఆధారాలతోసహా వెల్లడిస్తే.. టీడీపీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఎందుకు ఉలికి పడుతున్నాడో అర్థం కావడం లేదని జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్, రాష్ట్ర సంగీత, నృత్య కళా అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శీరిషా ప్రశ్నించారు. జిల్లాలో అక్రమ మైనింగ్‌పై కేసులు నమోదు చేయాల్సి వస్తే.. ముందు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితోపాటు అనేక మంది టీడీపీ నేతలపై చేసి అరెస్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ మీడియా సమావేశానికి కౌంటర్‌గా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ప్రెస్‌మీట్ పెట్టి అక్రమ మైనింగ్ జరగడం లేదని చెప్పడం సిగ్గు చేటన్నారు. సైదాపురం వస్తే నీకు నిజాలు తెలుస్తాయని అంటూ బీదకు సూచించారు. ఎంపీ వేమిరెడ్డి సైదాపురంలో ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారంటూ చెబుతున్నారని, ఎవరిని ఉద్ధరించడానికి అని నిలదీశారు. ప్రజలను ఉద్ధరించడానికే అయితే శంకుస్థాపన కూడా చేయని ఫ్యాక్టరీ కోసం పది నెలలుగా అన్ని మైన్లు ఎందుకు మూసివేశారని ప్రశ్నించారు. మైనింగ్ పనులపై ఆధారపడిన వారిని వేలాది కుటుంబాలను రోడ్డుపాల్జేయడం నిజం కాదా అని నిగ్గదీశారు.

కళ్లు తెరిచి చూడయ్యా..

సైదాపురంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై ఎమ్మెల్సీ బీదకు అవగాహన లేనట్టుందన్నారు. ఎమ్మెల్సీ అపాయింట్‌మెంట్ ఇస్తే ఆధారాలు చూపిస్తానని, లేదా అధికారులెవరైనా వచ్చినా మైనింగ్ జరుగుతున్న ప్రాంతాలను చూపిస్తానన్నారు. ఇక్కడ వేమిరెడ్డికి సంబంధించి లక్ష్మీ క్వార్ట్జ్ ప్రైవేట్ లిమిటెడ్, ఫినీ కంపెనీల ద్వారా క్వార్ట్జ్‌ను ఆయన మనుషులు విచ్చలవిడిగా అక్రమ మైనింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. అనుమతులున్న మైనింగ్ కంపెనీలను మూసివేసి, అనుమతుల్లేని కంపెనీల ద్వారా వీపీఆర్ మైనింగ్ చేస్తున్నారన్నారు. అనుమతులున్న కంపెనీలు మైనింగ్ చేయాలంటే క్వార్ట్జ్‌ను నాకే విక్రయించాలని వీపీఆర్ కండీషన్ పెట్టారని, ఇది ఎంత వరకు సమంజసమని బీద రవిచంద్రను ఆమె ప్రశ్నించారు. ఈ విషయాలు తెలియకపోతే వచ్చి కళ్లు తెరిచి చూడాలని శీరిషా చెప్పారు. అక్రమ మైనింగ్ ఆపాలని నాలుగు నెలలుగా కలెక్టర్, మైనింగ్ డీడీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులను కలిసి వినతి పత్రం కూడా ఇచ్చామన్నారు. అనుమతి లేని మైనింగ్ గనుల్లో జిలెటిన్ స్టిక్స్ వాడుతున్నారని డీఎస్పీకి, ఎస్పీకి ఫిర్యాదు చేసినా చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

చైనాలోనా.. సైదాపురంలోనా?

వీపీఆర్ ఫ్యాక్టరీ పెడుతున్నారంటూ బీద చెబుతున్నారని, అయితే లక్ష్మీ క్వార్ట్జ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ద్వారా చైనాకు 10 వేల టన్నుల క్వార్ట్జ్‌ను ఎగుమతి చేశారని, దీన్ని పరిశీలిస్తే కంపెనీ చైనాలో పెడుతున్నారా? అని పొట్టేళ్ల శీరిషా ప్రశ్నించారు. పద్మావతి మైనింగ్, సిద్ధి వినాయక మైనింగ్ కంపెనీలకు కూటమి ప్రభుత్వంలోనే డీఎంజీ అనుమతులు రిజెక్ట్ చేసిందన్నారు. ఈ రెండు మైన్‌లు 50 ఏళ్ల పూర్తయినవని, గడువు పూర్తయిన మైన్లలో వీపీఆర్ మనుషులు అక్రమ మైనింగ్ చేస్తున్నారన్నారు. ఇది అక్రమ మైనింగా? సక్రమ మైనింగా అని బీద రవిచంద్ర చెప్పాలని ప్రశ్నించారు. వేమిరెడ్డి అక్రమ మైనింగ్ వల్ల వేల కుటుంబాలు పనులు లేక రోడ్డున పడ్డాయన్నారు. పేదల ఉసురు ప్రభాకర్‌రెడ్డికి తగులుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర జంగం కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ ప్రసన్న, కార్పొరేటర్లు గుంజి జయలక్ష్మి, కామాక్షిదేవి, ఆర్.జెస్సీ, ప్రమీల, సరిత తదితరులు పాల్గొన్నారు.

గద్వాల్ రౌడీ మూకలతో కాపలా

తెలంగాణలోని గద్వాల్ రౌడీ మూకలతో అక్రమ మైనింగ్ ప్రాంతంలో కాపలా పెట్టారని పొట్టేళ్ల శీరిషా చెప్పారు. సాయి అనే వ్యక్తి నాది తెలంగాణ, నేను నాలుగు హత్యలు చేశానని చెప్పుకుంటూ నంబర్ ప్లేటు లేని కారులో తిరుగుతూ మైనింగ్ జరిగే ప్రాంతానికి ప్రజలను, మీడియాను కూడా వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. బీద మాటమీద నమ్మకంతో మేము అక్రమ మైనింగ్ జరిగే ప్రాంతానికి వెళ్తున్నామన్నారు. అక్కడ మాకు ఏం జరిగినా ఆయనదే పూచీ అని ఎస్పీకి మీడియా ముఖంగా విన్నవిస్తున్నామన్నారు. రాజకీయ స్వార్థంతో పార్టీలు మారుతూ తెల్ల రాయిని వ్యాపారంగా మార్చుకుని రూ.కోట్లు సంపాదిస్తున్న వేమిరెడ్డి అండ్ కో నిందలు మాత్రం మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌పై వేయడం సమంజసం కాదని తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలి

నెల్లూరు (అర్బన్): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ డీఈఓ బాలాజీరావును ఆదేశించారు. సోమవారం 'ది పేరంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ' ఆధ్వర్యంలో నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం అమలు, అధిక ఫీజులు వసూలు, కనీస వసతులు, అనుమతి ఒక చోట తీసుకుని మరో చోట పాఠశాల నిర్వహించడం వంటి పలు అంశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజుల్లోపు తనిఖీలు పూర్తి చేసి నిబంధనలు పాటించని పాఠశాలలపై కొరడా ఝుళిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే యుద్ధ ప్రకటనలు

- పహల్గాం ఘటన ఇంటెలిజెన్స్ వైఫల్యం
- 13న నెల్లూరుకు పీసీసీ అధ్యక్షురాలు రాక



తలారీకి డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకపత్రాన్ని అందజేస్తున్న దేవకుమార్‌రెడ్డి

నెల్లూరు (వీఆర్సీసెంటర్): దేశంలోని అన్ని రంగాల్లో బీజేపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని, దానిని కప్పిపుచ్చుకునేందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాకిస్తాన్‌పై యుద్ధ ప్రకటనలు చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నందున ప్రధాని యుద్ధ ప్రకటనలు చేస్తున్నారని, పహల్గాం ఘటన పూర్తిగా కేంద్ర ఇంటెలిజెన్స్ వైఫల్యం వల్లే జరిగిందని ఆరోపించారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మందిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను ఇప్పటికీ పట్టుకోలేకపోయారన్నారు. ప్రధాని రాష్ట్రంలో రాజధాని అమరావతికి శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చినా ఎలాంటి ప్రయోజనం ఉండదని, గతంలో కూడా చెంబుడునీళ్లు, మట్టి ఇచ్చి సరి పెట్టాడని పేర్కొన్నారు. కులగణన అంశాన్ని పార్లమెంట్‌లో మొట్టమొదటగా లేవనెత్తింది కాంగ్రెస్ పార్టీయేనని ఆ ఘనత రాహుల్‌గాంధీకే దక్కుతుందన్నారు. ఈ నెల 13వ తేదీన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జిల్లాలో పర్యటనకు రానున్నారని, అందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ త్వరలో ప్రకటిస్తామన్నారు. అనంతరం డీసీసీ ఉపాధ్యక్షుడిగా తలారి బాలసుధాకర్‌ను తిరిగి రెండోసారి నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉడతా వెంకట్రావ్‌యాదవ్, శ్రీనివాసులరెడ్డి, మోహన్‌రావు, ఫయాజ్, ఫజుల్లా తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన ఆశాలు



జిల్లా వైద్యాధికారిణికి సమ్మె నోటీసు ఇస్తున్న దృశ్యం

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఆశా వర్కర్ల న్యాయమైన కోర్కెల సాధనకు, ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలన్న డిమాండ్లపై ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మె చేపడుతున్నట్లు సోమవారం నోటీసును జిల్లా వైద్యాధికారిణి సుజాతకు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, అన్నపూర్ణమ్మ అందజేశారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్స్ న్యాయమైన కోర్కెల సాధన కోసం 20వ తేదీ నుంచి సమ్మె ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాలు 20 ఏళ్ల నుంచి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని, వీరిని ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఆశాలకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వం అందించనున్న సంక్షేమ పథకాలు ఆశాలకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్?

పొదలకూరు: పొదలకూరు మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ డీపీఓ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్‌కు సంబంధించి రిజర్వ్‌లో ఉన్న స్థలం విషయంలో హైకోర్టుకు తప్పుడు సమాచారం అందజేశారనే కారణంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. లేఅవుట్లో 286 అంకణాల స్థలాన్ని అప్పట్లో లేఅవుట్ వేసిన వారు ప్రజాప్రయోజనాల కోసం కేటాయించారు. అయితే కొందరు ఈ స్థలాన్ని క్రయ విక్రయాలకు పాల్పడడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ స్థలం వ్యవహారం న్యాయస్థానంలో ఉండడంతో ఇందుకు సంబంధించిన నివేదికను కార్యదర్శిని అందజేయాల్సిందిగా కోరారు. కార్యదర్శి క్రయ, విక్రయాలకు పాల్పడిన వారికి ఒక విధంగా, కోర్టుకు మరో విధంగా నివేదిక అందజేశారు. దీంతో కోర్టు జిల్లా ఉన్నత స్థాయి అధికారులను సరైన నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించింది. రెండు విధాలుగా నివేదికను అందజేసిన కార్యదర్శిపై కలెక్టర్ ఆగ్రహించారు. దీనికితోడు సోమవారం గ్రీవెన్స్‌లో స్థానికులు స్థలం విషయమై వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే కార్యదర్శిని సస్పెండ్ చేయాల్సిందిగా ఆదేశించారు.

క్లుప్తంగా

జొన్నవాడ ఆలయంలో వ్యక్తి మృతి

• ఆలయం మూత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో ఇందుకూరుపేట గంగపట్నం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం మృతిచెందాడు. దీంతో ఆలయాన్ని ఉదయం 11.30 గంటలకు వేద పండితులు మూసివేశారు. సాయంత్రం శుద్ధి చేసి, కొలువుల అనంతరం తెరిచారు. భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిచ్చారు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, అనారోగ్యంతో చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు.

కూల్‌డ్రింక్ కావాలని అడిగి..

• మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

మనుబోలు: పట్టపగలు ఇద్దరు యువకులు ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన మనుబోలు మండల కేంద్రంలోని పిడూరురోడ్డులో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చెన్ను బాలకృష్ణారెడ్డి, రమణమ్మ దంపతులు పిడూరురోడ్డులోని ఇంటి ముందు చిన్న అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. సాయంత్రం బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు కూల్‌డ్రింక్ కావాలని అడగడంతో రమణమ్మ అటు తిరిగి ఇచ్చే ప్రయత్నంలో ఉంది. అంతలో బైక్‌పై వెనుక కూర్చొన్న యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును బలంగా లాగాడు. బాధితురాలు తేరుకునేలోపు వారు వేగంగా వెళ్లిపోయారు. నాలుగు సవర్ల బంగారు గొలుసు విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 45.057 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 45.057 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 60, పిన్నేరు కాలువకు 150, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

కారు డ్రైవర్ మృతిపై కేసు నమోదు


మునాఫ్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): కారుడ్రైవర్ మృతి చెందిన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. జ్యోతినగర్‌కు చెందిన పి.మునాఫ్ (35), సర్తాజ్ దంపతులకు నాలుగేళ్ల కుమార్తె ఉంది. అతను ఎక్సైజ్ శాఖలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దంపతుల నడుమ విభేదాల నేపథ్యంలో సర్తాజ్ తన కుమార్తెతో పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మునాఫ్ తన తమ్ముళ్ల వద్ద ఉంటున్నాడు. ఇటీవల అతను మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉదయం తాగాడు. మధ్యాహ్నం ఇంటికొచ్చి భోజనం చేసి మళ్లీ బయటికి వెళ్లి తాగాడు. సాయంత్రం ఏడుగంటల ప్రాంతంలో ఆటోనగర్ ఫేజ్-1లోని ఓ టింకరింగ్ షాపునకు సమీపంలో ఆటోలో మునాఫ్ పడి ఉండటాన్ని సందానీ అనే వ్యక్తి చూశాడు. వెంటనే మునాఫ్ సోదరుడు ఇమ్రాన్‌కు తెలియజేశాడు. అతను తన బంధువు ఇలియాజ్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని తన అన్నను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. సోమవారం ఫిర్యాదు అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మునాఫ్ పూటుగా మద్యం తాగి ఊపిరాడక? లేదా ఇతర కారణంతో మరణించాడా? అనే వివరాలు పోస్టుమార్టంలో తెలియాల్సి ఉంది.

సమస్యలు పరిష్కరించాలంటూ..


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

• కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
• 345 వినతుల అందజేత

నెల్లూరు రూరల్: సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన జనం అధికారులను కోరారు. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఆనంద్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 345 అర్జీలు అందాయి. అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 133, పోలీస్ శాఖవి 16, మున్సిపల్ శాఖవి 35, సర్వేవి 44, పంచాయతీరాజ్ శాఖవి 40 తదితరులున్నాయి.

మామిడి చెట్లను నరికేశారు

కొందరు అక్రమంగా మామిడి చెట్లను నరికివేసి దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రాపూరు మండలానికి చెందిన వృద్ధురాలు మాతంగి పెంచలమ్మ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు.

ప్రైవేట్ కళాశాలలపై చర్యలకు డిమాండ్


మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

సెలవు రోజుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐఎస్‌ఎఫ్ నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఇప్పుడే మొదటి సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. నేతలు పవన్ కిశోర్, మస్తాన్ షరీఫ్, మౌళి, సిద్ధూ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి


బోయల చెన్నయ్య

పొలంలో బోరు వేసేందుకు ఉపాధి హామీ ఫీల్డ్ ఆఫీసర్ గుండోలు శీనయ్య అడ్డుకుంటున్నాడని ఆత్మకూరు మండలం మహిమలూరు తూర్పు దళితవాడకు చెందిన బోయల చెన్నయ్య తెలిపారు. గత సంవత్సరం బోరు వేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారంటూ బోరు వేయకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. నీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని, న్యాయం చేయాలని కోరారు.

కనీస వేతనం నిర్ణయించాలంటూ..


ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెరిగిన నిత్యావసర ధరలను పరిగణనలోకి తీసుకుని కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.35 వేలుగా నిర్ణయించాలని ఏఐటీయూసీ నేతలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి కనీస వేతనాలను తక్షణమే ప్రకటించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 12 నెలలకు పైగా వేతనాలు బకాయి పెట్టారని, వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

ఇప్పటికిప్పుడు ఖాళీ చేయమంటే ఎలా?


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు

• నెలరోజుల సమయం ఇవ్వండి
• ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: 'నెల్లూరులోని పాత చెక్‌పోస్ట్, బర్మాషెల్ గుంట రైల్వే స్థలాల్లో నివాసం ఉన్న వారిని ఇప్పటికిప్పుడు ఖాళీ చేయమంటే ఎలా?, వారికి నెలరోజుల సమయం ఇచ్చి ఖాళీ చేయించాలి' అని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆ స్థలాల్లో సుమారు 143 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. ఆరో తేదీ సాయంత్రంలోగా వారిని ఖాళీ చేయాలని రైల్వే అధికారులు హెచ్చరించారని, లేకపోతే జేసీబీలతో ఇళ్లు కూల్చేస్తామని తెలిపారన్నారు. ప్రభుత్వ అధికారులు గతంలో వెంకటేశ్వరపురం, అల్లీపురంలో ఇచ్చిన ఇళ్లను తక్షణమే పూర్తి చేసి అప్పగించాలన్నారు. ఇప్పటికిప్పుడు వెళ్లమంటే వృద్ధులు, పిల్లలు చాలా ఇబ్బంది పడతారన్నారు. నెల సమయం ఇచ్చి కేటాయించిన ఇళ్లను శరవేగంగా పూర్తి చేసి బాధితులకు అప్పగించాలని కలెక్టర్ కోరారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 134
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 238
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 262
లేయర్ చికెన్	: 170




విద్యుదాఘాతానికి గురై..

• వ్యక్తి మృతి

వెంకటాచలం: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఎర్రగుంట వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కసుమూరు గ్రామానికి చెందిన షేక్ బాబు (49) ఎర్రగుంట వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో సెంట్రింగ్ పనికి వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.90
సన్నవి : రూ.50
పండ్లు : రూ.30



మీరైనా దయ చూపండి సారూ..

• ఎస్పీకి వినతుల అందజేత


బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. మీరైనా దయ చూపండి సారూ' అంటూ పలువురు ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కోరారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 101 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన చట్టపరిధిలోని వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయా ప్రాంతాల పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్బీ, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, చెంచురామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ – 2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

• నా తండ్రిని 2020లో శ్రీనివాసులు, మరికొందరు హత్య చేశారు. ఆ కేసు ప్రస్తుతం కోర్టులో ఉంది. నిందితులు, వారి కుటుంబ సభ్యులు రాజీపడాలని, లేకుంటే అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. రక్షణ కల్పించాలని ఇందుకూరుపేటకు చెందిన ఓ వ్యక్తి కోరాడు.

• బెంగళూరుకు చెందిన ఐజాక్, నిశాంత్‌లు సోలార్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేస్తామని నమ్మబలికారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో నాకు తెలిసిన వారి నుంచి రూ.60 లక్షలు వసూలు చేసిచ్చాను. వారు ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడం లేదు. నగదు ఇవ్వడం లేదని నెల్లూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

• నా కుమారుడు గతనెల 12వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. దీనిపై లోతైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నగరానికి చెందిన ఓ వ్యక్తి వినతిపత్రం ఇచ్చాడు.

• నేను, భానుప్రకాష్ ప్రేమ వివాహం చేసుకున్నాం. కులాలు వేరుకావడంతో నా కుటుంబ సభ్యులు ఇబ్బందులు పెడుతున్నారు. మాకు రక్షణ కల్పించాలని ఇందుకూరుపేట మండలానికి చెందిన ఓ యువతి కోరింది.

దోషులు ఎంతటివారైనా వదలొద్దు

• మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని ఇస్కపాళెం గ్రామ పంచాయతీ పరిధిలో పోలినాయుడుచెరువు ముస్లిం కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ రఫీని దారుణంగా హత్య చేసిన నిందితులు ఎంతటివారైనా వదలొద్దని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు రఫీ హత్యలో ప్రమేయం ఉందని అక్కడి వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. వారిని కూడా అరెస్ట్ చేసి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. హత్యకు కారకులైన రంతుల్లా, ఖాదర్‌బాషా, ఆరిఫ్, పఠాన్ ఖాదర్‌బాషా, యాసిన్ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారన్నారు. వారు ఇక్కడ స్థిరపడి హత్యలు చేయడం దారుణమన్నారు. జిల్లాలో జరిగిన హత్యలను పరిశీలిస్తే శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయో అర్థమవుతోందన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ ఘటనపై స్పందించి నిష్పాక్షిక విచారణ జరిపించాలన్నారు. ఈ విషయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పార్టీ పరంగా ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ భూమిలో కలప నరికివేత


కలపను నరికిన దృశ్యం

దుత్తలూరు: మండల పరిధిలోని భైరవరం గ్రామంలో ప్రభుత్వ భూమిలో రెండు రోజులుగా అక్రమంగా కలప నరికి అమ్ముకుంటున్నారు. గ్రామస్తులు అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం తహసీల్దార్ యనమల నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకుల అండతో ఓ వ్యక్తి సర్వే నంబర్ 168 – 1ఏలో కలపను నరికించి ఇతరులకు అమ్ముతున్నట్లు ఆరోపించారు. దీనిని అడ్డుకోవాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వీఆర్వో మాల్యాద్రిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలప నరికివేతను ఆపేస్తామని, రికార్డులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మోటార్‌బైక్‌పై వెళ్తుండగా..

• కారు ఢీకొని ఒకరి మృతి
• మరొకరికి తీవ్ర గాయాలు

కావలి(జలదంకి): కావలి రూరల్ మండలం ముసునూరు సమీపంలోని ఓ ధాబా వద్ద మోటార్‌బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం జరిగింది. కావలి పోలీసుల కథనం మేరకు.. గౌరవరం గ్రామానికి చెందిన వినుకొండ శ్రీనివాసులు (50), వింతా శివకుమార్‌రెడ్డిలు బైక్‌పై గౌరవరం నుంచి కావలికి వస్తున్నారు. అదే సమయంలో నెల్లూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు బ్లూ మూన్ ధాబా సమీపంలో బైక్‌ను అతి వేగంగా ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. శివకుమార్‌రెడ్డి తలకు బలమైన గాయమవడంతో చికిత్స నిమిత్తం కావలికి తరలించారు. కాగా శ్రీనివాసులుకు భార్య సుగుణ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కావలి(జలదంకి): కావలి మండలం ముసునూరు రామ్‌నగర్‌కు చెందిన విష్ణువర్ధన్‌రావు (42) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. విజయమ్మ అనే మహిళకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. రెండో కుమారుడైన విష్ణుకు వివాహం కాలేదు. కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విజయమ్మకు ఇటీవల కంటి ఆపరేషన్ చేయగా జలదంకి మండలంలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లింది. ఆదివారం ఆమె విష్ణుకు ఫోన్ చేయగా ఇంటి వద్దనే ఉన్నానని చెప్పాడు. సోమవారం ఫోన్ చేయగా తీయకపోవడంతో ఆమె ముసునూరుకు వచ్చింది. తలుపులు తీయడం లేదని కిటికీలో నుంచి చూడగా విష్ణువర్ధన్‌రావు ఉరేసుకుని ఉన్నాడు. దీంతో విజయమ్మ చుట్టుపక్కల వారిని పిలిచి అతడిని కిందకు దించి చూడగా చనిపోయి ఉన్నాడు. విష్ణుకు గ్యాస్ట్రిక్ సమస్య ఉందని, అలాగే పెళ్లి కాలేదనే బాధ ఉండటంతో మనస్తాపంతో ఉరేసుకుని ఉండొచ్చని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఊపిరి భారమై..

• దగ్గు, ఆయాసం, పిల్లికూతలతో ఇబ్బంది
• జిల్లాలో 3 లక్షల మందికి పైగా రోగులు
• నేడు ప్రపంచ ఆస్తమా నివారణా దినోత్సవం



నెల్లూరు(అర్బన్): ఆస్తమా.. ఇది ఉన్నవారు ఎలాంటి కారణం లేకుండానే అప్పుడప్పుడు ఊపిరి పీల్చుకోలేక ఇబ్బంది పడుతుంటారు. ఆయాసం, దగ్గు వస్తుంది. నిద్రపోయే సమయంలో గురక పెడతారు. పిల్లికూతలు వస్తుంటాయి. ఛాతి భారంగా ఉంటుంది. ఊపిరితిత్తుల నాళాలు మూసుకుపోతాయి. ఫలితంగా ఆయాసంతో ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. సరైన వైద్యం అందించకపోతే ఒక్కో దఫా ప్రాణాలు పోతాయి. ఈ అంశాలను పరిశీలించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం మే నెలలో తొలి మంగళవారం రోజున ప్రపంచ ఆస్తమా నివారణా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఆస్తమా చికిత్స అందరికీ అందుబాటులో అనే థీమ్‌ను ప్రకటించింది. జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 3 లక్షల మందికి పైగా ఆస్తమాతో బాధపడుతున్నట్లు అంచనా. దుమ్ము, ధూళి, పొగ, ఘాటైన వాసనలు పడకపోవడంతోపాటు శీతల పానీయాలు, ఫ్రిడ్జ్‌లో ఉండే చల్లటి ఆహార పదార్థాలు తిన్నప్పుడు అలర్జీకి గురై ఈ వ్యాధి సోకుతుంది. కొంతమందికి జన్యుపరంగా కూడా వస్తుంది. ఇంకా వివిధ కారణాలతో పలువురు ఈ రోగం బారిన పడుతున్నారు. జిల్లాలో థర్మల్ పవర్ ప్రాజెక్టుల బూడిద నెల్లూరులోని పలు ప్రాంతాల్లో చేరుతోంది. దీని వల్ల కూడా కొందరు ఆస్తమా బారిన పడుతున్నారు. కాగా ఇది అంటువ్యాధి కాదని డాక్టర్లు పేర్కొంటున్నారు. ఆస్తమా కారణంగా జిల్లాలో ప్రతి ఏడాది సుమారు వెయ్యిమంది మరణిస్తున్నారని ఐఎంఏ అసోసియేషన్ నాయకులు అంచనా వేశారు.

పెద్దాస్పత్రిలో పరిశీలిస్తే..

నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో పల్మనాలజీ ఓపీ విభాగానికి రోజూ సరాసరిన 50 మంది ఆస్తమా రోగులు వస్తున్నారు. అడ్మిషన్‌లో పది మంది వరకు ఉంటున్నారు. ఇక జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో చికిత్స పొందే రోగుల సంఖ్య అధికంగానే ఉండొచ్చు. చిన్నపిల్లల్లోనూ ఆస్తమా బాధితులు ఎక్కువగా కనిపిస్తున్నారు. 30 ఏళ్ల క్రితం జిల్లాలో 3 శాతం రోగులుండగా నేడు పది శాతానికి పైగా పెరిగినట్లు డాక్టర్లు చెబుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే..



ఆస్తమాను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసుకోవచ్చు. ఆయాసం, వాతావరణం మార్పుల సమయంలో శ్వాస భారంగా తీసుకోవడం, పిల్లికూతలు లాంటి లక్షణాలు కనిపించినప్పుడు పల్మనరీ ఫంక్షనల్ టెస్ట్ (స్పిరోమెట్రీ) పరీక్షను చేయించుకుని ఊపిరితిత్తుల పనితీరు గురించి తెలుసుకోవాలి. వెంటనే తగిన చికిత్సలు తీసుకోవడం ద్వారా ఆస్తమాను అదుపులో ఉంచుకోవచ్చు. కాలుష్యానికి దూరంగా ఉండాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం జరిగే అవకాశం ఉంది. కరోనా సోకి కోలుకున్న వారిలో ఆస్తమా లక్షణాలు ఉంటున్నాయి. అలాంటి వారు తక్షణమే డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ అరుణ, పల్మనాలజీ విభాగం హెచ్ఓడీ, పెద్దాస్పత్రి